గడప గడపకూ అభివృద్ధి పనులను వివరించాలి

ఏర్గట్లలో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు

ఏర్గట్ల, అక్టోబర్ 24 : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గెలుపుకోసం బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజ పూర్ణానందం అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి వేముల గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను, సీఎం కేసీఆర్ ప్రకటించిన పార్టీ మ్యానిఫెస్టోను గడప గడపకూ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సర్పంచులు గుల్లే లావణ్య, పత్తిరెడ్డి ప్రకాశ్ రెడ్డి, కుండ నవీన్, గద్దే రాధా గంగారాం, కట్కం పద్మసాగర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు జక్కని మధుసూదన్, ఎస్టీ సెల్ మం డల అధ్యక్షుడు గంగారాం నాయక్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు జైనుద్దీన్, పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, కూతురు చిన్న సాయన్న, సుభాష్‌రెడ్డి, బోనగిరి రమేశ్, నాగిరెడ్డి రాజేందర్, పార్టీ నాయకులు రాజేశ్వర్, బద్దం ప్రభాకర్, బద్దం శ్రీనివాస్ రెడ్డి, జక్కుల గంగాధర్, వెంకట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మృతి చెందగా.. సోమవారం ఆయనను వేల్పూర్‌లోని నివాసంలో ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. మంజులమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. మంత్రి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. –వేల్పూర్, అక్టోబర్ 24

మూడోసారి విజయం సాధించడం ఖాయం

నవీపేట, అక్టోబర్ 24: బీఆర్ఎస్ మూడోసారి విజయం సాధించడం ఖాయమని పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు అన్నారు. మండల కేంద్రంలోని దాస్ అతిథి గృహంలో పార్టీ రాష్ట్ర నాయకుడు బీడీ దాస్, మండల నాయకుడు తెడ్డు పోశెట్టి, పార్టీ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావుతో కలిసి మంగళవారం పార్టీ మ్యానిఫెస్టో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వి.నర్సింగ్‌రావు, తెడ్డు పోశెట్టి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి పక్ష పార్టీలకు మైండ్ బ్లాక్ అయ్యే విధంగా మ్యానిఫెస్టోను ప్రకటించారని తెలిపారు. మ్యానిఫెస్టోను చూసిన ప్రతిపక్ష పార్టీలు నివ్వెర పోతూ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్ మరోసారి గెలవడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దొంత ప్రవీణ్‌కుమార్, లోకం నర్సయ్య, బి.సూరిబాబు, నవీపేట గ్రామ ఉప సర్పంచ్ కరిపే మల్లేశ్, మంత్రి సాయికుమార్‌గౌడ్, నవీన్‌రాజ్, దేవరాజ్, ఆప్సర్, ఉమర్, అజ్జూ, అల్తాఫుద్దీన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్థానిక నాయకులు

బోధన్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభం

- ఇంటింటికీ తిరిగిన మహిళా కౌన్సిలర్లు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాల అందజేత

బోధన్ 24వ వార్డులో మ్యానిఫెస్టో కరపత్రాలతో ప్రచారం ప్రారంభించిన బీఆర్ఎస్ మహిళా కౌన్సిలర్ సుధారాణి యాదవ్

బోధన్, అక్టోబర్ 24: విజయదశమి మంచిరోజు కావడంతో బోధన్ పట్టణంలో ఇద్దరు మహిళా కౌన్సిలర్లు తమ వార్డుల్లో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పట్టణంలోని 24వ వార్డులో కౌన్సిలర్, బీఆర్ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ సతీమణి సుధారాణి ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. వార్డులోని ఇండ్లకు వెళ్లి సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళిక అంశాలతో కూడిన కరపత్రాలను అందించారు. పట్టణంలోని 16వ వార్డులో బీఆర్ఎస్ కౌన్సిలర్ కొండ్ర పద్మ విజయదశమిరోజు బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తన వార్డులోని మహిళలకు కలుసుకుంటూ మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్‌ను గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు.

సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

జుక్కల్ మండల బీఆర్ఎస్ నాయకుల పిలుపు

నిజాంసాగర్, అక్టోబర్ 24: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 30న జుక్కల్ నియోజకవర్గంలో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జుక్కల్ మండల నాయకులు నీలూ పటేల్, సాయాగౌడ్ కోరారు. జుక్కల్ మండల కేం ద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన స మావేశంలో వారు మాట్లాడా రు. జుక్కల్ చౌరస్తాలో నిర్వహించనున్న బహిరంగ సభకు బీఆర్ఎస్ శ్రేణులతోపాటు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాధవ్‌రావు దేశాయ్, సొసైటీ చైర్మన్ శివానంద్, బొంపల్లి రాములు, బస్వంత్ శెట్కార్, వాసవి రమేశ్, కిరణ్, రమేశ్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

శక్కర్‌నగర్, అక్టోబర్ 24: బోధన్ పట్టణంలో వేంకటేశ్వర కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని భక్తి, శ్రద్ధలతో జరిపించారు. ఉదయం 10 గంటలకు యాజ్ఞికులు కల్వకుంట్ల శ్రీధరాచార్యుల మంత్రోచ్చారణల మధ్య, ఆలయ పూజారి దీపక్ పాండే సహకారంతో కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ కార్యక్రమానికి పలువురు యజమానులుగా వ్యవహరించగా.. ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

బోధన్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

ప్రమాదవశాత్తు కింద పడి ఒకరి మృతి

మోర్తాడ్, అక్టోబర్ 24: మండలంలోని వడ్యాట్ గ్రామానికి చెందిన మంద గొల్ల అజయ్(25) సోమవారం రాత్రి తాగిన మైకంలో తన ఇంటి ముందర ప్రమాదవశాత్తు పడి తలకు, ముక్కుకు తీవ్రగాయాలు కావడంతో మృతి చెందినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. అజయ్ భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

జానకంపేట్‌లో ఒకరి ఆత్మహత్యాయత్నం

ఎడపల్లి, అక్టోబర్ 24: మండలంలోని జానకంపేట్ గ్రామంలో కొద్ది రోజులుగా బెల్టు షాపులు, మద్యం దుకాణాలపై ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగాగ్రామానికి చెందిన పాపాయల శేఖర్ కల్లును అక్రమంగా విక్రయిస్తుండగా పట్టుపడ్డాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురై ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో కుటుంబీకులు వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 23: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో 63వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానిక ఎస్సై రాజ శేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్లూర్‌కు చెందిన డాకూరి చక్రవర్తి తన కొడుకుతో కలిసి బైక్ పై కమ్మర్‌పల్లిలోని తన దుకాణానికి బయల్దేరాడు. మార్గ మధ్యంలో జామామసీదు సమీపంలో ఎదురుగా కరిపె మారుతి తన రాయల్ ఎన్‌ఫీల్డ్ పై వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. దీంతో చక్రవర్తి, మారుతి ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వెంటనే వారిని దవాఖానకు తరలించారు. చక్రవర్తి అన్న కొడుకు డాకూరి సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ

దసరా సందర్భంగా పేదలకు దుస్తులను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ

మోర్తాడ్, అక్టోబర్ 24: మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో దసరా సందర్భంగా సోమవారం కరుణట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు నూతన దుస్తులను ఎంపీటీసీ శ్రీనివాస్, ట్రస్ట్ చైర్మన్ మహేశ్ పంపిణీ చేశారు. పండగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో దుస్తులను పంపిణీ చేశామని, రాబోవు రోజుల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడుతామని ట్రస్ట్ చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బాలాజీ, వినీల్, రవితేజ, రాజు, వెంకట్,అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.